క్లుప్తంగా

దుర్గమాంబ పరసకు ఆహ్వానం



ఆడారి ఆనంద్‌కుమార్‌కు ఆహ్వానం అందజేస్తున్న వర్మ తదితరులు

మల్కాపురం: ఈ నెల 31న శ్రీహరిపురం రెండు గుడుల సెంటర్ వద్ద దుర్గమాంబ పరస జరగనుంది. ఈ తీర్థానికి హాజరు కావాలని శుక్రవారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు స్థానిక యంగ్ బోయ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంగ భానోజీ నరసింహ వర్మ ఆహ్వాన పత్రం అందజేశారు. ఆనంద్‌కుమార్ విశాఖ డెయిరీ చైర్మన్‌గా ఎన్నికకావడంతో తొలుత అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు వెంకన్న పల్లకీ సేవ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలోని అయ్యన్ బేకరీ సమీపంలో వేంకటేశ్వరస్వామి పల్లకీ సేవ శనివారం సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహించనున్నారు. మాఘ మాసం సందర్భంగా వెంకన్న భక్తులు ఇక్కడ శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి మండపం ఏర్పాటు చేసి ఆ మండపంలో దేవతా మూర్తులను నెలకొల్పి పూజలు చేస్తారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఇక్కడ ప్రత్యేక పూజలు, పల్లకీ సేవ ఉంటుందని నిర్వాహకులు వివరించారు. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని పల్లకీ సేవ చూసి తరించాలని వారు కోరారు.

జమున మృతికి ప్రజా నాట్యమండలి సంతాపం

గోపాలపట్నం: ప్రముఖ సినీ నటి జమున మృతి పట్ల ప్రజా నాట్యమండలి జిల్లా శాఖ ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. ఈ మేరకు జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ హస్మీభవన్ ప్రజా నాట్యమండలి కార్యాలయంలో సంతాపం ప్రకటించింది. ఈ సమావేశంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి. రమణ, ఎం. చంటి సమ సంతాపాన్ని తెలియజేశారు. ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. ప్రజానాట్యమండలి రూపొందించిన మాభూమి నాటకంలో ఆమె నటించారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించాలని తెలిపారు. పూజలో దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ చేరుకున్న మంత్రులు



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న మంత్రులు తానేటి వనిత, బొత్స సత్యనారాయణ

గోపాలపట్నం: రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శుక్రవారం సాయంత్రం విశాఖ చేరుకున్నారు. సాయంత్రం 6.40గంటలకు వేర్వేరు విమానాల్లో రాజమండ్రి నుంచి తానేటి వనిత, హైదరాబాద్ నుంచి బొత్స సత్యనారాయణ విశాఖ వచ్చారు. వీరు నగరంలోకి రోడ్డు మార్గాన వెళ్లారు.

భద్రతతో కూడిన ప్రయాణాలు సాగించాలి



సదస్సులో మాట్లాడుతున్న గాజువాక డిపో మేనేజర్ ప్రవీణ



సింహాచలం డిపోలో మాట్లాడుతున్న ఎంవీఐ బుచ్చిబాబు

- గాజువాక డిపో మేనేజర్ ప్రవీణ

మల్కాపురం: గాజువాక ఆర్టీసీ డిపోలో భద్రతా వారోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 2వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం డిపో ఆవరణలో జరిగిన కార్యక్రమంలో డిపో మేనేజర్ బి.ప్రవీణ మాట్లాడారు. బస్సు నడిపే డ్రైవర్లు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్లపై పలు విధాలుగా డ్రైవింగ్ చేసే వారు ఎదురుపడతారని,అలాంటి వారిని గమనిస్తూ ప్రయాణికులను తమ తమ గమ్య స్థానాలకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. నిత్యం బస్సు కండీషన్‌ను చెక్ చేసుకుంటూ ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే తక్షణం స్పందించి ప్రయాణికులను అక్కడ దింపి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. ఇంధన పొదుపు పాటిస్తూ సరైన సమయానికి గమ్యస్థానానికి చేరే విధంగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో డిపో అధికారులు,డ్రైవర్లు పాల్గొన్నారు.

సింహాచలం డిపోలో..

గోపాలపట్నం: సింహాచలం ఆర్టీసీ డిపోలో రహదారి భద్రతా వారోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి రెండు వరకు పలు కార్యక్రమాలు చేపట్టనున్నామని డిపో మేనేజర్ కె. రాజశేఖర్ తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె. బుచ్చి బాబు మాట్లాడుతూ ప్రతీ డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ చేయించుకోవాలన్నారు. వాహనం నడిపే ముందు ఆ వాహనం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. 2021 గణాంకాలు ప్రకారం ఎక్కువ ప్రమాదాలు సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల లోపు జరుగుతున్నాయని వివరించారు. ఆయా సమయాల్లో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్యారేజీలో వాహనాన్ని ఎప్పటికప్పుడు తనిఖీ చేసి కండిషన్‌లో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఎల్. సాయి తులసి, సూపరింటెండెంట్ (మెకానికల్)కేవీజీకే కొండలరావు, రీజనల్ డ్రైవింగ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ ఎంఎస్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలి



హెచ్‌పీసీఎల్ గేటు వద్ద నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

మల్కాపురం : కష్టపడి పని చేసే కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం జరిగే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ మల్కాపురం జోన్ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) విస్తరణ పనులు చేస్తున్న కార్మికులకు పనికి తగ్గ వేతనం ఇవ్వటం లేదని, భద్రత కల్పించడం లేదని ఆవేదన చెందారు. కార్మిక చట్టాలకు విరుద్ధంగా వారితో 12 గంటలు పని చేయించుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి చర్యలపై యాజమాన్యం, లేబర్ అధికారులు స్పందించకుంటే సీఐటీయూ యూనియన్ ఆందోళన కార్యక్రమాలు చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.


కేజీహెచ్ కోపరేటివ్ సొసైటీ సేవలు ప్రశంసనీయం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ అశోక్ కుమార్ తదితరులు

మహారాణిపేట : కేజీహెచ్ క్లాస్–3, క్లాస్–4 ఎంప్లాయిస్ కోపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ సభ్యులకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం కేజీహెచ్ ఆవరణలో సొసైటీ కార్యవర్గం ప్రచురించిన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు నమ్మి అప్పారావు మాట్లాడుతూ సొసైటీలో 135 మంది సభ్యులు ఉన్నారన్నారు. సభ్యుల అవసరాలు తీర్చడంలో సొసైటీ మెరుగ్గా పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి బవురు శెట్టి వీరుబాబు, ఉపాధ్యక్షుడు ఎ.శ్రీనివాస్, కోశాధికారి ఎం.శ్రీనివాస్, డైరెక్టర్లు ఎస్.శ్రీనివాసరావు, ఎంవీవీఎస్ రవికుమార్, ఎ.వెంకటరావు, వై.దుర్గమ్మ, కె.అశోక్‌కుమార్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి ఈ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్న వారిని అరెస్టు చేయాలి



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న ఉద్యోగులు

డాబాగార్డెన్స్: ఆలిండియా వర్కింగ్ ఉమెన్ కో ఆర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు డాబాగార్డెన్స్‌లో గల బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ టెలికాం కార్యాలయం వద్ద బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్న వారిని అరెస్టు చేయాలని ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలకు మద్దతుగా బీఎస్ఎన్ఎల్ వర్కింగ్ ఉమెన్ కో ఆర్డినేషన్ కమిటీ విశాఖ జిల్లా యూనియన్ తరఫున నిరసన చేపట్టినట్టు విశాఖ జిల్లా కన్వీనర్ మీనాకుమారి, సాగర్, డి. గోపాలకృష్ణ, బి. లక్ష్మీనారాయణ తెలిపారు.

ఉప్పెనలా ఉక్కు ఉద్యమం



దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు ఉద్యమం ఉప్పెనలా మారుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఎన్నో త్యాగాలకోర్చి సాధించుకున్న పరిశ్రమను పరిరక్షించుకునేందుకు ఐక్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తూ నిర్వహిస్తున్న ఉక్కు మహాగర్జనను విజయవంతం చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షల్లో 715వ రోజు శుక్రవారం ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్ కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు, గుమ్మడి నరేంద్ర మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం ఇలా సంస్థలను అమ్ముకుంటూ పోతే భారతదేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థ మిగలదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉంటూ, ఉద్యమాన్ని ఉధృతం చేయాలని కోరారు. ఈ నెల 30న నిర్వహించ తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జనను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ నాయకులు టి.భాస్కరరావు, ఎ.అప్పారావు, ఎస్.పాపారావు, ఎస్.గోవిందు, డి.వి.రమణ, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల చొరవతో తల్లి చెంతకు బాలుడు



టీసీ చంద్రశేఖర్ సంరక్షణలో నిహాన్



తల్లి, టీచర్లతో నిహాన్

అక్కిరెడ్డిపాలెం: శుక్రవారం ఉదయం 11 – 12గంటల మధ్య సమయం.. ట్రాఫిక్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ షీలానగర్ సిగ్నల్‌పాయింట్ వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంతలో అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఓ బాలుడు ఏడుస్తూ కనిపించాడు. వెంటనే ఆ బాలుడి నుంచి వివరాలు సేకరించి, అతడు చదువుతున్న పాఠశాలకు చేర్చాడు. వివరాలివి.. ఎన్ఏడీ సమీపంలోని శాంతిపురానికి చెందిన అల్లు నిహాన్ బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన నిహాన్ పుస్తకం తీసుకురాకపోవడంతో, వెంటనే తేవాలని టీచర్ పంపించారు. ఎలా వెళ్లాడో తెలియదు గానీ, నిహాన్ షీలానగర్ అయ్యప్పస్వామి ఆలయ పరిసరాల్లో దీనంగా సంచరిస్తూ ట్రాఫిక్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌కు కనిపించాడు. వెంటనే ఆయన గాజువాక ట్రాఫిక్ ఎస్ఐ అప్పలనాయుడుకు సమాచారం అందించారు. ఎస్ఐ ఆదేశాలతో కానిస్టేబుల్ స్వయంగా బాలుడు ఇచ్చిన వివరాల ప్రకారం బుచ్చిరాజుపాలెంలో పాఠశాలకు తీసుకువెళ్లి, టీచర్‌కు అప్పజెప్పారు. పాఠశాల ఉపాధ్యాయుడు బాలుడి తల్లిని పిలిపించి, అప్పగించారు. తండ్రి లేని బాలుడిని క్షేమంగా అప్పగించడంతో తల్లి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత

- భావి తరాలకు కాలుష్యరహిత పర్యావరణం అందించాలి
- జీవీఎంసీ ఏడీసీ సన్యాసిరావు
- స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన



రోడ్లు శుభ్రం చేస్తున్న జీవీఎంసీ అధికారులు

గాజువాక : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండటం అందరూ బాధ్యతగా తీసుకోవాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 కార్యక్రమంపై మార్కెట్ మెయిన్ రోడ్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక విధాలుగా ప్రజలకు వివరించామన్నారు. భావితరాలకు కాలుష్యరహిత పర్యావరణాన్ని అందించడానికి అందరూ సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో నిషేధించగలిగినప్పుడే ఇది సాధ్యమవుతుందని చెప్పారు. ఇళ్లలో చెత్తను కూడా తడి, పొడి, ప్రమాదకర చెత్తలుగా విభజించి క్లాప్ వాహనాలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ అధికారులు రోడ్లు శుభ్రం చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ బ్రాండ్ అంబాసిడర్ ప్రసన్నకుమార్, జోనల్ కమిషనర్ పి.సింహాచలం, సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై రథసప్తమి పూజలు నేడు

సింహాచలం: సింహగిరిపై శనివారం రథసప్తమి పూజలు విశేషంగా నిర్వహించేందుకు సింహాచలం దేవస్థానం వైదిక,అధికారులు ఏర్పాట్లు చేశారు. వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో హంసమూలన ఉన్న పురాతన రాతిరథాన్ని ముస్తాబు చేశారు. రాతిరథంపై స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నాడు. ఉదయం ఏడు గంటల సమయంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను రాతిరథంపై అధిష్టంపజేసి స్వామికి అభిషేకాలు, ఆరాధనలు, పూజలు నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి రాతిరథంపై స్వామికి నిత్య కల్యాణంనిర్వహిస్తారు.

శ్రీకృష్ణాపురం గోశాలలో....

వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో శనివారం రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గోశాలలో 12 అడుగుల ఎత్తున కొలువై ఉన్న సప్త అశ్వ వాహనదారుడైన సూర్యనారాయణ స్వామి విగ్రహం వద్ద పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు.

ప్రతిభకు పురస్కారం





కలెక్టర్ మల్లికార్జున చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న గోపాలపట్నం తహసీల్దార్ జయ, ఎంవీఐ శ్రీనివాసయాదవ్

గోపాలపట్నం: గణతంత్ర దినోత్సవంలో భాగంగా గురువారం పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో ప్రతిభ చూపిన అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ మల్లికార్జున ప్రశంసా పత్రాలు అందజేశారు. వీరిలో గోపాలపట్నం తహసీల్దార్ కొర్ర జయ, రవాణాశాఖలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస యాదవ్ ఉన్నారు. వీరికి సహచర ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

ఆరేళ్ల తర్వాత కుటుంబ సభ్యుల చెంతకు..



కుటుంబ సభ్యులకు సుభాష్‌ను అప్పగిస్తున్న మురళి, తదితరులు

ఎంవీపీ కాలనీ: మానసిక స్థితి బాగోలేక కుటుంబానికి దూరమైన సుభాష్ చంద్రబోస్ అనే వ్యక్తి ఎట్టకేలకు కుటుంబ సభ్యుల చెంతకు చేరాడు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన చంద్రబోస్ ఎలక్ట్రికల్ విభాగంలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే ఆరేళ్ల కిందట చెట్టు మీద నుంచి పడిపోవడంతో తలకు గాయమైంది. అప్పటి నుంచి మానసిక స్థితి బాగోకపోవడంతో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అయితే అక్కడి నుంచి తప్పించుకున్న సుభాష్ విశాఖ చేరుకున్నాడు. జగదాంబ కూడలిలో బట్టలు లేకుండా తిరుగుతున్న అతన్ని గమనించిన రెడ్‌క్రాస్ ప్రతినిధులు మహారాణిపేట పోలీసుల సహకారంతో విశాఖ మానసిక ఆస్పత్రిలో చేర్పించారు. కొంత కాలంగా చికిత్స పొందుతున్న సుభాష్ ఆరోగ్యం నయం కావడంతో తన కుటుంబ సభ్యుల వివరాలు తెలియజేశాడు. దీంతో పెద్దాపురంలోని ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం రెడ్ క్రాస్ ప్రతినిధులు మురళి ఆధ్వర్యంలో సుభాష్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

యోగా, ధ్యానంతో మానసిక ఆరోగ్యం



మాట్లాడుతున్న ఆచార్య రాజేంద్ర కర్మార్కర్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్, ఆనంద్ మార్గ్ ప్రచారక సంఘం సంయుక్తంగా రెండు రోజులు యోగా, ధ్యాన శిక్షణ శిబిరాన్ని నిర్వహించాయి. ఏయూ ఎన్ఎస్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఏయూ ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య పి.రాజేంద్ర కర్మార్కర్ శుక్రవారం ప్రారంభించారు. ముందుగా అతిథులు ప్రభాత్ రంజన్ సర్కార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేంద్ర కర్మార్కర్ మాట్లాడుతూ విద్యార్థి దశలో మానసికంగా దృఢంగా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి యోగా, ధ్యానం ఉపకరిస్తాయన్నారు. రినైసెన్స్ యూనివర్సల్(ఆర్‌యూ) కార్యదర్శి ఆచార్య వితమోహనానంద విద్యార్థులకు యోగా ప్రాధాన్యత, నిత్య జీవనంలో ఉపయోగాలను తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, ఆర్‌యూ ప్రతినిధి నారాయణ పాండా, ఏయూ ఎన్ఎస్ఎస్ ట్రెనింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.రామచంద్రరావు, స్టీల్‌ప్లాంట్ ఏజీఎం ఎ.వి.వి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఘంటసాల లఘు నాటిక ప్రదర్శన



ఘంటసాల లఘు నాటికలో డాక్టర్ రహ్మతుల్లా, నందగోపాల్, సత్యవాణి

డాబాగార్డెన్స్ : స్వాతంత్య్ర సమరయోధుడు, ప్రముఖ గాయకుడు, పద్మశ్రీ ఘంటసాల శత జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘంటసాల లఘు నాటిక ప్రదర్శించారు. ఘంటసాల పాటలతో పద్మిని, సోమయాజుల సత్యవాణి, కందర్పరాధ, పేరూరి వెంకట సోమశేఖర్, పాలంకిపాటి శ్రీనివాసరావు, శివప్రసాద్, జె. మురళీ, జనాబ్..హసీబ్ పాటలకు అనుగుణంగా హావభావాలతో చక్కగా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఘంటసాల గానావధాని, అవధాన శ్రేష్ఠ డాక్టర్ సయ్యద్ రహ్మతుల్లా ప్రేక్షకులు అడిగిన ప్రశ్నలకు అలవోకగా సమాధానాలు చెప్పి అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఘంటసాల జీవిత చరిత్రలో ముఖ్య ఘట్టాలు తీసుకుని లఘు నాటిక ప్రదర్శించారు. బడే గులాం ఆలీఖాన్‌గా డాక్టర్ రహ్మతుల్లా, ఘంటసాల పాత్రధారిగా నందగోపాల్, సావిత్రమ్మగా సోమయాజుల సత్యవాణి చక్కగా నటించారు. ఘంటసాల పాటలను బి. అరుణ్ కుమార్, ఎంవీఆర్, కల్యాణి తదితరులు ఆలపించారు. ఈ సందర్భంగా ఆరాధన గ్రూప్ అడ్మిన్ డాక్టర్ రహ్మతుల్లా మాట్లాడుతూ ఘంటసాల కేవలం గాయకుడే కాదని, స్వాతంత్య్ర సమర యోధుడిగా తన సేవలు అందించారన్నారు. ఆయనను గుర్తు చేసుకుంటూ ఘంటసాలకు భారత రత్న ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సమర యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘాల ప్రతినిధులు

సీతమ్మధార : కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ 2014లో పార్లమెంట్ సాక్షిగా ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చి, విభజన హామీలు అమలు చేస్తామని చెప్పి మోసం చేసిందని ఏఐఎస్ఎఫ్ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమరయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ జనవరి 25 నుంచి ఫిబ్రవరి 4 వరకు హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు సమరయాత్ర చేపట్టామని తెలిపారు. జిల్లా కార్యదర్శి యు.నాగరాజు, ఎం.రాంబాబు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లావణ్య

అగనంపూడి: జంతువులు కూడా మనుషుల వలే ప్రాణులని, వాటిని హింసించడం నేరమని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ లావణ్య అన్నారు. జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా అగనంపూడి వెటర్నరీ ఆస్పత్రి ఆధ్వర్యంలో అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జంతు సంక్షేమం, సంరక్షణపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నగరం, మఫిసల్ ప్రాంతాల్లో పశువులను రోడ్లమీద మేతకు విడిచిపెట్టడంతో అవి రోడ్డు మీద దొరికే ప్లాస్టిక్ వ్యర్థాలు, కాగితాలు తిని, జీర్ణ సంబంధమైన వ్యాధులతో అనారోగ్యానికి గురవుతున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగి మృతి చెందుతున్నాయని చెప్పారు. జంతువులను రోడ్ల మీద విడిచిపెట్టకుండా వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. అలాగే పాలు అధిక ఉత్పత్తి కోసం హార్మోన్ సంబంధ ఇంజక్షన్లు ఇస్తున్నారని, ఇది శ్రేయస్కరం కాదన్నారు. పక్షుల ఆవాస స్థావరాలను ఇబ్బంది పెట్టకూడదని సూచించారు. తరువాత విద్యార్థులతో కైండ్‌నెస్ క్లబ్‌లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణారావు, ఎస్ఎస్ ఉపాధ్యాయురాలు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.